జిల్లాకు భారీ వర్షసూచన

● అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అధికారులంతా అప్రమత్తంగా ఉండాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'వాతావరణ శాఖ (మిగతా 7వ పేజీలో..)

● కాగితాల్లోనే.. సోషల్‌వెల్ఫేర్ విద్యార్థులకు పోషకాహారం
● కూరగాయల టెండర్ల విషయంలో ఎంతో వ్యత్యాసం
● జిల్లాలో 29 రకాలు రూ.405కే ఖరారు
● పార్వతీపురం మన్యం జిల్లాలో అవే దినుసులు రూ.969కి ఆమోదం
● తక్కువ ధరతో నాణ్యమైన భోజనం సాధ్యమేనా?
● అధికారుల తీరుపై విమర్శలు

ఇది బహిరంగ దోపిడీ



శ్రీకాకుళం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అందించాల్సిన భోజనం విషయంలో అధికారుల తీరు అక్రమాలకు ఊతమిచ్చేలా ఉంది. పౌష్టికాహారానికి సంబంధించి కూరగాయల సరఫరాకు టెండర్ల ఖరారు వ్యవహారమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రైతుల వద్దకు వెళ్లి తెచ్చుకున్నా సాధ్యంకాని ధరలకు కాంట్రాక్టర్ టెండర్లు వేయగా.. వాటిని పరిశీలించకుండానే అధికారులు ఆమోదించడం చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళితే.. అన్నివర్గాల పిల్లలకు విద్యాబోధనతోపాటు వసతి, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కేటగిరిల వారీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల హాస్టళ్లు 9 ఉన్నాయి. ఇందులో విద్యార్థులకు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ప్రభుత్వం సీజనల్ వారీ లభ్యమయ్యే పండ్లతోపాటు.. ఆకుకూరలు, కూరగాయలతో భోజనం అందిస్తోంది. రోజుకి పాఠశాల విద్యార్థికి రూ.45చొప్పున, కళాశాల విద్యార్థికి రూ.55చొప్పున సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా వెచ్చిస్తోంది. విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తుంది. మిగిలిన కూరగాయలు, ఆకుకూరలు, నిత్యావసరాలను 'జిల్లా కొనుగోలు సంఘం' ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకుని.. టెండర్లను పిలుస్తారు. వెండర్‌ను ఎంపిక చేసి.. వారి ద్వారా సరుకులను సమకూరుస్తారు. అందుకుగాను కాంట్రాక్టరు, కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్ ఇచ్చిన (మిగతా 6వ పేజీలో..)

పండ్ల ధరలు.. ఇలా...

పసుపు అరటిపండు	20	34
జామ	30	45
యాపిల్	60	130
స్వీట్ ఆరెంజ్ (కమలా)	25	75
పుచ్చకాయ	20	30
దానిమ్మ	60	125
సపోటా	30	45
బొప్పాయి	20	30
ద్రాక్ష	40	100
నారింజ	25	25
మామిడి	30	55

హాస్టళ్లలో టెండర్ల ధరలు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఇలా.. (రూ.ల్లో)

కూరగాయలు (కిలో)	శ్రీకాకుళం	మన్యం
బంగాళాదుంప	15	28
వంకాయ	15	25
క్యాబేజీ	15	25
బెండకాయ	15	28
గోరుచిక్కుడు	15	28
చిక్కుడు	15	28
దొండకాయ	15	25
టమోటా	15	28
క్యారెట్	15	45
ఆనపకాయ	15	24
మునగకాయ	15	32
ముల్లంగి	10	25
కాలీఫ్లవర్	15	25
అరటికాయ	15	25
ఉల్లిపాయలు	15	33
అల్లం	15	65
నిమ్మకాయ	15	22
వెల్లుల్లి	15	100
పచ్చిమిర్చి	15	40
బీట్ రూట్	15	20
బీన్స్	15	35
బీరకాయ	15	25
కరివేపాకు	10	35
కొత్తిమీర	10	28
గోంగూర	10	35
చుక్కకూర	10	40
మెంతికూర	10	15
తోటకూర	10	25
పాలకూర	10	40
కొబ్బరికాయ (ఒకటి)	10	20

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

● రైతులు ఆందోళన చెందవద్దు
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. 'జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి, ఇతర పంటలు 3,73,000 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ సాగుకుగాను మొదటి, రెండో విడతల్లో కలిపి 20,481 మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం. రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 11,443 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా 12,393 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 23,836 మెట్రిక్ టన్నుల యూరియను రైతులకు సరఫరా చేశాం. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద 415.3 మెట్రిక్‌టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 123 మెట్రిక్ టన్నులు, బఫర్‌లో 561 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1099 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. అదనంగా మరో 589 మెట్రిక్ టన్నులు సరఫరా కానున్నాయి. ఎరువుల సరఫరాపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, విజిలెన్స్ శాఖల సహకారంతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. రబీ సీజన్‌కు కావలసిన ఎరువుల నిల్వలు కూడా సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామ'ని కలెక్టర్ తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌తో శాశ్వత ఉపాధి

● మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం
● త్వరలో కిరాణాషాపుల మాదిరి రేషన్ డిపోలు
● పింఛన్ల తొలగింపుపై వైసీపీ నాయకుల దుష్ప్రచారం తగదు
● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం భావనపాడులో రేషన్‌కార్డు లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. రూ.1.60కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మత్స్యకారుల సమస్యలు తెలుసుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'భావనపాడులో హార్బర్ నిర్మాణ విషయమై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్ర మత్స్యశాఖ మంత్రిని కోరాం. అంచనాలు రూపొందించాం. హార్బర్ నిర్మాణం పూర్తయితే మత్స్యకారులందరికీ శాశ్వత ఉపాధి లభిస్తుంది. సముద్రంలో ఇసుక మేటను తొలగిస్తాం. భావనపాడులో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు (మిగతా 8వ పేజీలో..)

● 'మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా పలు పథకాలను అమలు చేస్తున్నాం. 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది. వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకారుడికి రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందించాం. వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతిని విస్మరించింది. సముద్రంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు పరిహారంతోపాటు బోట్లకు సబ్సిడీ డీజిల్ బకాయిలు కూడా చెల్లించలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు బకాయిలు చెల్లించాం. భావనపాడు మత్స్యకారులకు రూ.35లక్షలతో బోట్లుకు ఇంజన్లు ఇచ్చి ఆదుకున్నామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు.

● 'అనర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగిస్తే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో 6వేల మంది పింఛన్లు తొలగించినట్టు కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేశారు. కేవలం 90 మంది అనర్హులకు మాత్రమే పింఛన్లు తొలగించాం. దీనిపై దుష్ప్రచారం తగదు. త్వరలో రాష్ట్రంలో రేషన్‌డిపోలు నెలరోజులపాటు తెరిచే ఉంటాయి. బియ్యంతోపాటు కిరాణాషాపుల మాదిరి అన్ని నిత్యావసర వస్తువులు విక్రయిస్తారు. బియ్యం వద్దనుకున్న వారు ఇతర సరుకులు తీసుకొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో 11వేల బస్సులు ఉండగా వాటిలో 9వేల బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. కొంతమంది వైసీపీ నాయకులు ఉచిత బస్సులు ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై అనుమానం ఉంటే వైసీపీ నాయకులంతా చీరలు కట్టుకుని బస్సులెక్కాలని ఎద్దేవా చేశారు. ప్రశ్నించేవాళ్లు.. అసత్య ప్రచారం చేసేవాళ్లు బస్సు ఎక్కి మహిళలకు ప్రయాణం ఉచితమో కాదో తెలుసుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఇదే సానిపాలెం గ్రామం

మా ఊర్ల పేరు మార్చండయ్యా!

● పలకాలంటేనే ఇబ్బందిగా ఉంటోంది
● అవమానాలు భరించలేకపోతున్నాం
● అధికారులకు రెండు గ్రామాల ప్రజల వినతి

మెళియాపుట్టి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):

కొన్ని ఊర్ల పేర్లు వినటానికి వినసొంపుగా ఉంటాయి. వాటి పేర్లు చెప్పగానే అక్కడి ప్రజల జీవన విధానం, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు ఇట్టే తెలిసిపోతాయి. కొంతమంది తమ గ్రామాల పేర్లను సగర్వంగా చెప్పుకుంటారు. అయితే, మెళియాపుట్టి మండలంలోని రెండు గ్రామాల ప్రజలు తమ ఊరి పేర్లను చెప్పుకోవాలంటే అవమానకరంగా భావిస్తున్నారు. దీనికి కారణం ఆ ఊర్ల పేరులో అసభ్యకర పదం ఉండడమే. ఆ రెండు గ్రామాలే సానిపాలెం, సవర సానిపాలెం. పద్ద పంచాయతీలో ఈ రెండు గ్రామాలు మారుమూల కొండలకు ఆనుకొని ఉన్నాయి. పర్లాఖిమిండి రాజవంశీయులు కొంతమంది ఈ ప్రాంతాల్లో ఒంపుడుగత్తెలను ఉంచి వారికి మాన్యం కింద వందలాది ఎకరాల భూములు ఇచ్చారు. దీనివల్ల పూర్వీకులు ఆ గ్రామాలకు సానిపాలెం, సవర సానిపాలెంగా పేరు పెట్టి పిలిచేవారు. అదే పేరు రికార్డుల్లో సైతం నమోదు చేసినట్లు ఆ గ్రామస్థులు తెలుపుతున్నారు. సానిపాలెంలో 220 కుటుంబాలు వరకు ఉన్నాయి. ఈ గ్రామానికి సమీపంలో కొంతమంది ఎస్టీ కులాలు వారు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ గ్రామాన్ని సవర సానిపాలెంగా పిలుస్తున్నారు. అయితే, తమ ఊర్ల పేర్లను చెప్పడానికి అవమానకరంగా ఉంటుందని ఆ రెండు గ్రామాల ప్రజలు (మిగతా 6వ పేజీలో..)

'మీ కోసం'లో కూడా..

గ్రామం పేరు మార్చాలని సానిపాలెం వాసులు సోమవారం శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక.. 'మీ కోసం' కార్యక్రమంలో కూడా అధికారులకు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామం పేరు ఎవరికైనా చెప్పాలంటే ఇబ్బందిగా ఉంటోందని, రామయ్యపాలెంగా మార్చాలని కోరుతూ డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. టీడీపీ నాయకుడు ఎం.ఎల్.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సానిపాలెం గ్రామస్థులు

సిగ్గుగా ఉంటోంది



మా గ్రామం పేరు చెప్పాలంటే సిగ్గుగా ఉంటోంది. ఊరు పేరు చెప్పి అవమానం పడుతున్నాం. కొందరు మావైపు చూసి నవ్వుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మా గ్రామం పేరు మార్చితే మంచిది.

- తొరగది ఆదిలక్ష్మి, సానిపాలెం

పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు



ఊరి పేరులో అసభ్యకర పదం ఉండడంతో దాన్ని చెప్పేందుకు మా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఆడపిల్లలకు సంబంధాలు రావడం లేదు. మా గ్రామం పేరు చెబితేనే చాలామంది పెళ్లి చూపులకు రాని పరిస్థితులు ఉన్నాయి.

- దేవాది ఢిల్లమ్మ, సానిపాలెం

అవమానాలు భరిస్తున్నాం



నేను పెయింటర్‌గా పని చేస్తున్నాను. ఎక్కడికైనా వెళ్లినప్పుడు మా గ్రామం పేరు చెబితే మీ ఊరిలో వేశ్యలు ఉన్నారా అని ప్రశ్నిస్తున్నారు. చాలా బాధగా ఉంటోంది. ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. మా గ్రామం పేరు మార్చటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మండల ఎల్లమ్మనాయుడు, సానిపాలెం

పూర్వం నుంచి ఇదే పేరు



మా తాతతండ్రుల నుంచి మా గ్రామానికి సానిపాలెంగా పేరు ఉంది. పూర్వం రాజులు పాలించిన కాలంలో మా గ్రామంలో ఒంపుడుగత్తెలను ఉంచడం వల్ల సానిపాలెంగా పేరువచ్చిందని మా పెద్దలు చెప్పేవారు. ఆ నాటి నుంచి నేటి వరకూ ఆ పేరు మారలేదు.

-బాగు దానయ్య, సానిపాలెం

రామయ్యపాలెంగా మార్చాలి



మా గ్రామానికి మంచి పేరు పెట్టాలని అందరం నిర్ణయించుకున్నాం. రామయ్యపాలెంగా నామకరణం చేస్తే బాగుంటుందని అనుకున్నాం. ఈ పేరును పెట్టాలని అధికారులకు వినతిపత్రం అందించాం.

-దేవాది ప్రసాదరావు, సానిపాలెం

విచిత్రంగా చూస్తున్నారు



మా ఊరి పేరు ఎవరికైనా చెబితే విచిత్రంగా చూస్తున్నారు. అందుకే కొన్నిసార్లు పాలెం గ్రామమని చెబుతున్నాం. మా గ్రామం పేరును అధికారులు రికార్డుల్లో తొలగించి రామయ్యపాలెంగా నమోదు చేయాలి.

-డి.పాపారావు, సానిపాలెం

పథకం ప్రకారమే హత్య
● ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజశేఖర్ మృతి
● నిందితుడి అరెస్టు
8లో

పరిశుభ్రత ఇలాగేనా?
● టెక్కలిలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం
● శానిటేషన్ మేస్త్రిని తొలగించాలని ఆదేశాలు

దిగుబడి లేక.. గిట్టుబాటు కాక
● కళతప్పిన కొబ్బరి పంట ● మూతపడిన అనుబంధ పరిశ్రమలు
● విపత్తులు, తెగుళ్లతో పంట నాశనం ● నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం
6లో

ధరల పట్టిక తప్పనిసరి
● లింగ నిర్ధారణ పరీక్షలు నేరం
● డీఎంహెచ్‌వో డా.అనిత
7లో

అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
● ఎస్పీ మహేశ్వరరెడ్డి

ప్రేమించిన యువతి.. పెళ్లికి నిరాకరించిందని..

● సెల్‌టవర్ ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం



సెల్‌టవర్‌పై శివకుమార్



శివకుమార్‌తో మాట్లాడుతున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని దీపామహల్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సెల్‌టవర్‌పైకి ఎక్కి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పొందూరు మండలం కింతలి గ్రామం దేవాదివీధికి చెందిన విబూది శివకుమార్.. హైదరాబాద్‌లో ఎంఎస్ చేస్తున్నారు. ఐదేళ్లుగా ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన ఓ యువతి, సూరిబాబు ప్రేమించుకుంటున్నారు. ఆ యువతి ఇంటిలో ప్రేమ వివాహానికి అంగీకరించడం లేదంటూ శివకుమార్‌ను గత కొన్ని నెలలుగా దూరం పెట్టింది. కొద్దిరోజుల కిందట శివకుమార్ యువతి వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుందామని మరోసారి అడగ్గా.. ఆమె (మిగతా 8వ పేజీలో..)

తప్పిన ముప్పు

● మాకివలస ప్రాథమిక పాఠశాలలో ఊడిన సీలింగ్
● 'నాడు-నేడు' పనుల్లో బయటపడిన నాణ్యతలోపం






కూలిన సీలింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో దాలినాయుడు

నరసన్నపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో చేపట్టిన 'నాడు-నేడు' పనుల్లో నాణ్యతలోపం తాజాగా బయటపడింది. సోమవారం ఉదయం మాకివలస ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతి గది సీలింగ్ ఊడిపడిపోయింది. ఉదయం 8 గంటలకు పాఠశాలను శుభ్రం చేసేందుకు ఆయా తలుపుతీయగా ఒక గదిలో బెంచీలపై సీలింగ్ పడిపోయింది. మళ్లీ 8.30గంటల సమయంలో మిగతా సీలింగ్ కూలిపోయింది. ఈ పాఠశాలలో 42 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. సీలింగ్ పడిన గదిలో ఒకటి, రెండో తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థులు లేని సమయంలో సీలింగ్ పడిపోవడంతో పెనుప్రమాదం తప్పిందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఎంఈవో పేడాడ దాలినాయుడు పాఠశాలను పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. ఇటీవల వర్షాలకు భవనం నుంచి నీరుకారి సీలింగ్ తడిచి కూలిపోయిందని నిర్ధారించారు. ఈ విషయంపై ఇంజనీరింగ్ అధికారులు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంఈవో దాలినాయుడు తెలిపారు.

దిగుబడి లేక.. గిట్టుబాటు కాక



కవిటి ప్రాంతంలో కొబ్బరి తోట



కొమ్ముపురుగు సోకిన కొబ్బరిమొక్క

- కళతప్పిన కొబ్బరి పంట
- మూతపడిన అనుబంధ పరిశ్రమలు
- విపత్తులు, తెగుళ్లతో పంట నాశనం
- వెంచర్లగా మారుతున్న తోటలు
- వలసపోతున్న కార్మికులు
- నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం

కవిటి/కంచిలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కొబ్బరి పంట కళతప్పింది. ఉద్దానం అంటే పచ్చని కొబ్బరి తోటలు కళ్లముందు కదలాడుతాయి. అంతటి ఘనమైన చరిత్ర, ప్రాధాన్యత ఉన్న ఉద్దానం కొబ్బరి పంట రానురాను తన ప్రాధాన్యతను కోల్పోతోంది. కొబ్బరి పంటకు ఆశిస్తున్న చీడపీడలతోపాటు వరుస ప్రకృతి వైపరీత్యాలు ఉద్దానం కొబ్బరి పంటను తీవ్రంగా నష్టాలకు గురిచేశాయి. గతంలో ఉద్దానంలో ఎవరింటికి వెళ్లినా.. ముందుగా కొబ్బరి బోండాం ఇచ్చి మర్యాద చేసేవారు. అటువంటి ఉద్దానంలో నేడు అనారోగ్యంతో బాధపడుతున్న వారు తాగాలంటే కూడా నాణ్యమైన కొబ్బరి బొండాం దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అనుబంధ పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. ఇదే సమయంలో విపత్తులు, తెగుళ్ల పంటలను నాశనం చేశాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా సాగు గిట్టుబాటు కావడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఆశించిన ధర లభిస్తున్నా దిగుబడి ఆశాజనంగా లేదు. దీంతో కొబ్బరి పంట, పరిశ్రమపై ఆధారపడుతున్న కార్మికులు వలస పోతున్నారు. సెప్టెంబరు రెండో తేదీన ప్రపంచ కొబ్బరి దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం..

గతంలో...

కొబ్బరి పంటకు ఉద్దానం ప్రసిద్ధిగాంచింది. ఎక్కడ చూసినా చుట్టూ పచ్చనిచెట్లతో కళకళలాడేది. శుభకార్యాల్లో కొబ్బరికాయదే అగ్రతాంబూలం. ఆ కాయలేని పండుగ లేదు. అందుకే అన్ని సీజన్లలో కొబ్బరికి డిమాండ్ ఉంటుంది. నాణ్యత, పరిమాణంలో తీసిపోని రీతిలో ఉండే ఈ ప్రాంత కాయలు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. అందుకే ఆ కాయను శ్రీఫలం అని పిలుస్తారు. రెండెకరాల కొబ్బరితోట ఉంటే చాలు కుటుంబం సాఫీగా సాగేది. ప్రత్యక్ష, పరోక్షంగా రెండులక్షల కుటుంబాల మేరకు జీవనోపాధి దక్కేది. ఇదంతా గతం. ప్రస్తుత పరిస్థితి భిన్నంగా తయారైంది. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు కుదేలవుతున్నారు. తెగుళ్ల తాకిడితో దిగుబడి తగ్గడంతో రైతన్నలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, సంతబొమ్మాళి మండలాల్లోని 36,920 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఉద్దానం ప్రాంతంలోనే 30వేల ఎకరాల వరకు కొబ్బరి పంట సాగులోఉంది. దీర్ఘకాలం దిగుబడినిచ్చే చెట్లు (ఈస్ట్‌కోస్ట్ టాల్) ఈప్రాంతంలో అధికంగా కనిపిస్తాయి. సాధారణంగా ఈరకం నాటిన ఏడేళ్ల వరకు కాపునకు రావు. ఆ తర్వాత 60 నుంచి 75 సంవత్సరాల వరకు దిగుబడినిస్తాయి. వర్షాధారంపై ఆధారపడే ఈపంటకు భారీ గాలులు వీస్తే చెట్లు నేలకొరుగుతాయి. ప్రధానంగా తుఫాన్లు ఈప్రాంత రైతులను కంటిమీద కునుకు లేకుండాచేస్తున్నాయి. 1999 నుంచి తుఫాన్లు వెంటాడుతూనే ఉన్నాయి. 2018లో వచ్చిన తితలీ తుఫాన్‌తో ఉద్దానంతోపాటు వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాల పరిధిలో అధికశాతం చెట్లు నాశనం కావడంతో కొబ్బరితోటలు మైదానంలా మారాయి. దీంతో ఉద్దానం రైతులు ప్రత్యమ్నాయ ఉపాధికోసం వెతకాల్సివస్తోంది. కుటుంబాన్ని పోషించడానికి, అప్పులకు వడ్డీలు చెల్లించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఏడాది పొడవునా ఆదాయాన్ని ఇచ్చే తోటలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి.

రైతుకంట కన్నీరు

ఉద్దానంలో కొబ్బరి తోటలు, ఉత్పత్తులపై ప్రత్యక్ష, పరోక్షంగా రెండు లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వరుస తుఫాన్లు, చీడపీడలతో కొబ్బరి పంట సాగుకు భారంగా మారాయి. 1999లో సంభవించిన పెను తుఫాన్ అనంతరం ఎర్రనల్లి సోకి కాయ నాణ్యత, పరిమాణాన్ని దెబ్బతీసింది. తితలీ తుఫాన్ తర్వాత తెల్ల దోమ విజృంభణతో పచ్చదనాన్ని హరించడమే కాక ఉత్పత్తి తగ్గిపోయింది. వీటికి తోడు కాండం తొలుచుపురుగు ఆశించి మొక్కదశలోనే కొబ్బరి నాశనమై రైతుకంట కన్నీరు తెప్పిస్తోంది. అలాగే నల్లముట్టి పురుగు, తెల్లదోమ ఉధృతికి చెట్లు పాడవుతున్నాయి. మూడేళ్లగా తీవ్ర వర్షాభావంతో కొబ్బరి పంట స్థితిగతులు మారిపోయాయి. దిగుబడులు లేక వచ్చిన కాయలు పరిమాణం చిన్నదిగా మారడంతో గ్రేడ్లుగా విభజించి వ్యాపారులకు తక్కువ వచ్చిన ధరలకు అమ్మకాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొబ్బరివ్యాపార కేంద్రమైన కంచిలిలో వ్యాపారం వెలవెలబోగా, ఒడిశా వ్యాపారులపైనే ఆధారపడాల్సి వస్తోంది.తమిళనాడు, కేరళతోపాటు కోనసీమ నుంచి కాయలను దిగుమతి చేసుకొని కొందరు వ్యాపారులు ఉద్దానం కాయలుగా చెప్పి తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. కొబ్బరికాయల ధర దోబూచులాడుతూ రైతుకు అందని ద్రాక్షగా మారింది. ప్రస్తుతం వెయ్యి కాయల ధర రూ.26వేలు పలుకుతోంది.కానీ తోటల్లో ఆశించిన కాయలు దిగుబడి లేవు.

శాశ్వత చర్యలు శూన్యం

కొబ్బరిపంటను మెరుగుపరిచి రైతులను ఆదుకుంటామని చెప్పడమే తప్ప ఇప్పటికీ శాశ్వతంగా ఆదుకునే చర్యలు లేవని రైతులు వాపోతున్నారు. కేరళ తరహాలో చర్యలు ఏర్పడితే తప్ప కొబ్బరి రైతు బతుకు మెరుగుపడదని రైతులు భావిస్తున్నారు. కేరళలో కొబ్బరినీళ్ల నుంచి తొక్క వరకు ప్రతీది వాణిజ్యానికి అవసరంగా వాడుతున్నారు. రైతు సహకార సంఘాలతో కలిసి కేరళలో కొబ్బరికాయ నుంచి 100 రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటిలో 45 రోజుల వయస్సు కలిగిన కొబ్బరి ఆయిల్‌కు డిమాండ్ ఉంది. ఇదే పద్ధతిలో పరిస్థితులు ఇక్కడ లేవు. 2008లో కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం ద్వారా చికకోల్ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థను ఉద్దానంలో ఏర్పాటు చేసి 10వేల మంది రైతులకు భాగస్వామ్యం చేశారు.

కొబ్బరి దినోత్సవం ఎందుకు..

కొబ్బరి దినోత్సవాన్ని శ్రీఫల దినోత్సవం అని పిలుస్తారు. దీ ఎషియా-పసిఫిక్ కోకోనట్ కమ్యూనిటీ (ఏపీసీసీ) అన్న అంతర్జాతీయ సంస్థ 1969 సెప్టెంబరు 2న ఇండోనేషియా రాజధాని జకర్తాలో స్థాపించారు. కొబ్బరి ఉత్పత్తులను పెంచి ప్రాధాన్యం తెలియజేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ సంస్థ తన 35వ వార్షికోత్సవం నుంచి ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుతోంది.

కొబ్బరి రైతు పరిస్థితి దారుణం



ఉద్దానంలోని కొబ్బరిరైతు పరిస్థితి దారుణంగా ఉంది. పంటపైన ఆధారపడి కుటుంబాన్ని గడపటం కష్టంగా మారింది. తెగుళ్ల తాకిడితో పంట దిగుబడి తగ్గింది. మొక్కల సంరక్షణ భారంగా మారింది. కుటుంబ నేపథ్యంలో భూములను అమ్ముకోవాల్సి వస్తోంది. కాయల ధర నిలకడగా లేకపోవటం మరింత కుంగదీస్తోంది. కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

-ఎ.త్రివిక్రమరావు, రైతు,కవిటి

ఉపాధి పథకంతో అనుసంధానం చేయాలి..



కొబ్బరితోటలకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేసి రైతులకు తోడ్పాటు అందించాలి. మొక్కలు పాడైనా వాటిని తొలగించాలన్నాకొత్తవి నాటుకోవాలన్నా ఖర్చుతో కూడుకున్న పనిగా మారింది. ప్రభుత్వం కొబ్బరిరైతులకు ఉపాధి ద్వారా సహాకారం అందిస్తే కొంతమేర లబ్ధిచేకూరుతుంది.

-జి.గిరిబాబు, రైతు, కవిటి

రైతులను ఆదుకోవాలి



ఉద్దానంలోని కొబ్బరిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పంటకు ధర నిలకడగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాంతంలో బయట ప్రాంత కాయలను తీసుకువచ్చి విక్రయిస్తుండడంతో మరింత నష్టం కలుగుతోంది. తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులతో కొబ్బరి దిగుబడి తగ్గింది. దీంతో రైతులు మరింత నష్టపోతున్నారు. తెగుళ్ల తాకిడితో కాయపరిమాణం, నాణ్యత తగ్గడంతో ఉదానం కాయలను కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపటం లేదు.

-జె.యుగంధర్, రైతు, జల్లుపుట్టుగ

ఇది బహిరంగ దోపిడీ!

(ఐదో పేజీ తరువాయి)

జాబితా ఆధారంగా నెలవారీ సరుకులకు వెచ్చించిన మొత్తాన్ని బిల్లుల రూపంలో చెల్లిస్తారు. అయితే జిల్లాలో మాత్రం అధికారులు ఆచరణకు సాధ్యంకాని విధంగా సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలలకు కూర గాయలు, ఆకుకూరలు, పండ్ల సరఫరాకు ధరలు ఖరారు చేస్తూ వెండ ర్‌కు రెండు నెలల కిందట అనుమతి పత్రాన్ని ఇచ్చేశారు. ఒక్కో హాస్ట ల్‌కు 29రకాల కూరగాయలు, ఆకుకూరలు, ఒక కొబ్బరికాయను కేవలం రూ.405కే సరఫరా చేస్తామని టెండర్ వేసిన వ్యక్తికి కేటాయించేశారు. ఇందులో చాలా కూరగాయలు కిలో కేవలం రూ.15కే సరఫరా చేస్తామని చెప్పడం.. అధికారులు టెండర్ ఖరారు చేయడం గమనార్హం. పక్కనే ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు ఇవే కూరగాయలు, ఆకుకూరలను సరఫరా చేసేందుకు రూ. 969కు ఆమోదం లభించింది. అక్కడ 'జిల్లా కొనుగోలు సంఘం' క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత రేట్లను ఖరారుచేశారు. ఇక పండ్ల విషయానికొస్తే నాసిరకం కూడా లభించని ధర ఇక్కడ అగ్రిమెంట్‌లో ఉంది. కాంట్రాక్టర్ మార్కెట్‌లో కూరగాయలు, పండ్లను అధిక ధరకు కొనుగోలు చేసి.. విద్యార్థులకు తక్కువ ధరకు సరఫరా చేసే పెద్దమనసు ఉండదన్నది అందరికీ తెలిసిన విషయమే. కానీ అధికారులు మాత్రం కాంట్రాక్టరు ఇచ్చిన టెండర్‌నే ఆధారం చేసుకోవడం.. సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా సంక్షేమం ఎలా అన్న అనుమానం తలెత్తుతోంది. వసతిగృహాల్లో విద్యార్థులకు సరిపడా పండ్లను, వంటకు అవసరమైన సామగ్రిని సరఫరా చేస్తున్నారా? లేదా అన్నది సందేహం వ్యక్తమవుతోంది. చవకగా ధరలు కాగితాల్లో చూపించి.. క్షేత్రస్థాయిలో మోసాలను.. అక్రమాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హోల్‌సేల్ మార్కెట్ అయినా, నేరుగా రైతు వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకున్నా సరే గిట్టుబాటుకాని ధరలను టెండర్‌లో కోట్ చేయడం.. ఖరారు చేసేయడం విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే సంఘాల వారీగా టెండర్ల ధరల విషయమై ప్రభుత్వ ఉన్నతాధికారులకు, మంత్రులకు ఫిర్యాదు చేరినట్లు విశ్వసనీయ సమాచారం.

మా ఊర్ల పేరు మార్చండయ్యా!

(ఐదో పేజీ తరువాయి)

ఆవేదన చెందుతున్నారు. ఎవరైనా మీది ఏ ఊరు అని అడిగితే చెప్ప లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. ఆధార్, రేషన్ తదితర కార్డులతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లలో సైతం సానిపాలెంగా ముద్రి స్తుండంతో అవమానకరంగా ఉంటుందని తెలుపుతున్నారు. పిల్లలకు పెళ్లి సంబంధాలు కూడా రావడం లేదని తల్లిదండ్రులు కన్నీరుపెడుతున్నారు. అయితే, ఇటువంటి గ్రామాల పేర్లతో పాటు సరిహద్దులు మార్చుకోవ డానికి కూటమి ప్రభుత్వం ఇటీవల ఏడుగురు మంత్రులతో కూడిన మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో తమ ఊర్ల పేర్లను మార్చాలని కోరుతూ తహసీల్దార్ బి.పాపారావుకు ఆ రెండు గ్రామాల ప్రజలు ఇటీవల వినతిపత్రం అందజేశారు. సానిపాలెం గ్రామం పేరును తొలగించి రామయ్యపాలెంగా మార్చాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పేరు మార్పునకు చర్యలు చేపడతామన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

అర్జీల పరిష్కారానికి చర్యలు: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 64 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తం ఉండాలి

- భారీవర్షాల నేపథ్యంలో ఎస్పీ, కలెక్టర్‌తో మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు



సంతబొమ్మాళి: సముద్రంలో బోటులో ప్రయాణిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో వర్షపాతం, నదులలో ప్రవాహ పరిస్థితులపై సమాచారం తీసుకున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ప్రభుత్వం జారీ చేసే బులిటెన్లను పాటించాలని తెలిపారు. మునుముందు రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాలువలు, చెరువులపై క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు అప్రమత్తంగా ఉంచాలని వ్యవసాయ శాఖకు ప్రత్యేక సూచనలు చేశారు. విద్యుత్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులు కలిసి వర్షాల ప్రభావాన్ని అంచనా వేసి చర్యలు చేపట్టాలన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో సెప్టెంబరులో ఏర్పడే అల్పపీడనాలు వాయుగుండాలుగా మారి విశాఖ పరిసరాల్లో తీరం దాటే అవకాశం 60శాతం ఉందని నిపుణులు చెబుతున్నారని, విపత్తుల నిర్వహణ సంస్థ కూడా రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ఇప్పటికే తెలిపిందని మంత్రి తెలిపారు.

భావనపాడులో పర్యటన

సంతబొమ్మాళి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భావనపాడు సముద్రతీరంలో ఇసుకమేట తొలగించేందుకు పోర్టు అధికారులతో మాట్లాడి డెడ్జరును తెప్పించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారులకు శాశ్వత పరిష్కారం కోసం భావనపాడులో హార్బర్ నిర్మించనున్నట్లు చెప్పారు. భావనపాడు సముద్రతీరంలో మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి బోటులో ప్రయాణించారు. సోమవారం ప్రజాసేవలో ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడానికి భావనపాడు వచ్చిన మంత్రికి మత్స్యకారులు సముద్రంలో ఇసుకమేట వేయడం వల్ల మూడు నెలలుగా వేట లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో స్పందించిన మంత్రి సమస్య చూసేందుకు బోటులో తీరంలో పర్యటించారు. ఇసుకమేట వేయడం వల్ల బోట్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ ఏడాది కనీసం వేట కూడా లేదని మత్స్యకారులు తెలిపారు. సముద్రంలో పేరుకు పోయిన ఇసుకమేట డెడ్జర్‌తో ద్వారా తొలగించాలని కోరారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: కలెక్టర్

భావనపాడు తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. సోమవారం ప్రజలసేవలో ప్రభుత్వం కార్యక్రమానికి భావనపాడు వచ్చిన కలెక్టర్ సముద్రతీరంలో బోటులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావనపాడు తీరప్రాంతం పర్యాటకంగా ఎంతో బాగుందని, పర్యాటకంగా అభివృద్ధికోసం రాష్ట్ర మారిటైమ్ బోర్డుకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు.భావనపాడు సముద్రతీరంలో బోటు షికారు కోసం డబుల్‌డెక్కర్ బోట్లు ఏర్పాటు చేస్తామన్నారు. బీచ్‌రోడ్డు అభివృద్ధి చేపట్టడంతో పాటు ఎంపీ నిధులతో సీఎస్ఆర్ సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ఉన్న రెండు లైట్ హైస్‌లు మరమ్మతు చేస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.

నిమజ్జనోత్సవ సందడి

- కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. సోమవారం ఐదోరోజు పలుచోట్ల వినాయక విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను పలువురు వేలంపాటలో దక్కించుకున్నారు.



పోలాకి: శ్రీనివాసరావుకు లడ్డూను అప్పగిస్తున్న కమిటీ సభ్యులు

నృత్యాలు చేసి.. సముద్రంలో నిమజ్జనం చేసి



కవిటి: వినాయకుని ఊరేగిస్తున్న భక్తులు



నందిగాం: వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం తరలిస్తున్న భక్తులు

కవిటి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఐదురోజులుగా పూజలందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపులో మేళతాళాలు, ఒడిశా కళాకారుల డ్రమ్ము వాయిద్యాలతో పురవీదుల్లో తిరిగారు. మహిళలు, యువకులు ప్రత్యేక దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ సముద్రం వద్దగల రంగాలగెడ్డలో విగ్రహాలను నిమజ్జనం చేపట్టారు.ఈ సందర్భంగా డి.గొనపపుట్టుగలో నిర్వహించిన లడ్డూను రూ.1,00,201కు కె.పోలయ్య, లయ దంపతులు దక్కించుకున్నారు. అలాగే మరో లడ్డూను బి.భువనచంద్ర, సోనియా దంపతులు రూ.75,500కు దక్కించుకున్నారు. కవిటిలోని నాయుడుగారి వీధిలో 49వేలు, సినిమాహాలు రోడ్డులో నెలకొల్పిన వినాయకుని వద్ద లడ్డూను రూ.80వేలుకు భక్తులు పొందారు. బస్టాండు ఆవరణలో నెలకొల్పిన వినాయకుని వద్ద లడ్డూను రూ.36వేలు పలికింది. జగతిలోని శమళ్లవీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా కళాకారులను సత్కరించారు.

జలుమూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగం సూరావీధిలో గణేశుని పంచమరాత్రి ఉత్సవాలు నిర్వహించి సోమవారం వంశధారనదిలో నిమజ్జనం చేశారు. మంగళ వాయిద్యాలు, కోయిడాన్సులు, కోలాటం నడుమ స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

నందిగాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నందిగాం, పెంటూరు, దేశళభద్ర గ్రామాల్లో ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో ఆటపాటలు మధ్య ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. నందిగాం మెయిన్ ప్రాథమిక పాఠశాల వీధిలో గల వినాయకుని లడ్డూను రూ.32వేలుకు పొందూరు ప్రభాకరరావు దక్కించుకున్నారు.

లడ్డూ ఊరేగింపు



కాశీబుగ్గ: న్యూకాలనీలో వేలంపాడిన లడ్డూను ఊరేగిస్తున్న భక్తులు

కాశీబుగ్గ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల 16వవార్డు న్యూకాలనీ గల వినాయకుని మండపం వద్ద లడ్డు వేలం పాటను ఆదివారం రాత్రి నిర్వహించారు. స్థానికవీధికి చెందిన సకలభుక్తుల శంకర్ నాగరాజులు రూ.1.46లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం సోమవారం వినాయక మండపం నుంచి వేలం పాడిన లడ్డూను మహరాణిపేట మీదుగా చమహేశ్వమ్మ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వీధి నుంచి మహిళలు, యువకులు, పిల్లలతో ఊరేగించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- పోలాకి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడివలస పంచాయితీ పరిధిలోని జిల్లేడువలసలో గణపతి ఉత్సవాల్లో ఏర్పాటుచేసిన లడ్డూ లక్షా ఒక వేయి రూపాయలు పలికిందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన సాధు శ్రీనివాసరావు లడ్డూవేలం పాటలో దక్కించుకున్నాడు.

అలరిస్తున్న బియ్యం వినాయకుడు



పొందూరు: బియ్యంతో తయారుచేసిన విగ్రహం


పొందూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దళ్లవలస పంచాయతీ ఎస్‌జీఎన్ పేట గ్రామంలో బియ్యంతో చేసిన విగ్రహం భక్తులను అలరిస్తోంది. పర్యావరణానికి హాని చేసే పీవోపీ విగ్రహాలకు ప్రత్యామ్నాయంగా గ్రామస్థులు బియ్యంతో తయారుచేసిన విగ్రహాన్ని తయారు చేశారు.

ఆకట్టుకుంటున్న మండపాలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద సోమవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అచ్చంపేట, బెల్లుపడలో విగ్ర హాలు చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు.



ఇచ్ఛాపురం: బెల్లుపడలో ఆకట్టుకుంటున్న వినాయకుడు



పేదల అభ్యున్నతికి చంద్రబాబు కృషి: అశోక్

కవిటి, సెప్టెం బరు 1(ఆంధ్ర జ్యోతి): పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. చంద్రబాబు నాయుడు సీఎంగా మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం ఆయన న విలేకరులతో మాట్లాడారు. మహిళలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలను ప్రవేశ పెట్టారన్నారు. యువకులను అవకాశాలు కల్పించాలని కంప్యూటర్ టెక్నాలజీకి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం గా పనిచేస్తున్నారన్నారు. ఆయనతో పాటు నేతలు ఎస్.చంద్రమోహన్, బి.రమేష్, ఎం.కుమార్, బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాల పంపిణీ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల పోస్టులను భర్తీ చేశామని ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రామయ్యపుట్టుగలో నియామక పత్రా లను అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీల సంఘం నాయకు రాలు బి.హైమ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రోన్లు: శంకర్


డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న డ్రోన్లను సానివాడ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. అలాగే మ్యాజిక్ డ్రైన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం పిఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఇంకుడు గొయ్యిల మాదిరిగా మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలు ప్రారంభించామని, వీటితో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. రైతులకు కావాల్సిన పనిముట్లను సబ్సిడీపై అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిష్టప్పేట, తండేంవలస, సానివాడల్లో మూడు డ్రోన్లు అందజేసినట్లు తెలిపారు. అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది తీరుపై మహిళల ఆగ్రహం

సరుబుజ్జిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం- బత్తిలి మార్గంలో ప్రయాణించేందుకు వచ్చిన మహిళలను ఆర్టీసీ సిబ్బంది బస్సులో ఎక్కించేందుకు నిరాకరించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుబుజ్జిలి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లేందుకు కొందరు మహిళలు వేచి ఉన్నారు. హిరమండలం వైపు నుంచి వచ్చిన మూడు బస్సులు మహిళలు ఎక్కించలేదు. దీంతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు ఆర్టీసీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బత్తిలి నుంచి శ్రీకాకుళం వెళుతున్న పల్లెవెలుగు బస్సు ఎక్కేందుకు మహిళలు వెళ్లగా మధ్యలో బస్సు ఆగదంటూ కండక్టర్ సమాధానం చెప్పి బస్సును ముందుకు వెళ్లేలా ప్రయత్నించాడు. దీనిపై తెలుగు యువత మండల అధ్యక్షుడు దవళ సింహాచలం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇల్లాకుల ప్రభాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమనాపల్లి రవికుమార్ ఆర్టీసీ ఉద్యోగు లతో వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేదేమీ లేక కండక్టర్ మహిళలను బస్సులో ఎక్కించారు.

జిల్లాకు భారీ వర్షసూచన

(ఐదో పేజీ తరువాయి)

సమాచారం మేరకు జిల్లాలో మంగళవారం భారీ వర్షం, బుధ, గురు, శుక్రవారాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాల కారణంగా ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలి. కాల్వలు, చెరువులు గండ్లు పడకుండా క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షించాలి. విద్యుత్, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలి. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశామ'ని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. వాతావరణ సూచనలను పాటించాలని తెలిపారు.

4 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఈనెల 4వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌక ర్యం కల్పిస్తామన్నారు. ఇతర సమాచారం కోసం 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రెండు ప్రదేశాలకు స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్

గార రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిసరాల స్వచ్ఛతను పాటిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తున్న రెండు పంచాయతీలను స్వచ్ఛత గ్రీన్ లీఫ్(ఎస్‌జీఎల్) రేటింగ్‌కు ఎంపిక చేశారు. గార మండలం శ్రీకూర్మం జంక్షన్ వద్ద ఉన్న బీవీఆర్ ఫంక్షన్ ప్లాజా, లావేరు ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్తతో సంపద తయారీ కేంద్రం)లను సోమవారం స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ-2025 అకాడమీ ఆఫ్ మోనటరింగ్ స్టడీస్ కేంద్ర బృందం సభ్యులు బిడ్డిక చంద్రరావు, అమ్మాజీరావు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌పై పర్యావరణం, పర్యాటకుల ఆకట్టుకునేలా ఈ రెండు ప్రదేశాలను విశ్రాంత విడిదిగా గుర్తించి స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్‌కు ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు.

ధరల పట్టిక తప్పనిసరి: డీఎంహెచ్‌వో

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఏఆర్టీ సెంటర్లు, కార్పొరేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, ల్యాబ్‌లలో ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయా లని డీఎంహెచ్‌వో డా.కె.అనిత స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. అందరూ నియమ, నిబంధనలను పాటించాలని కోరారు. ఆసుపత్రుల్లో అందించే వైద్య సదుపాయాలు, వైద్య పరీక్షలకు సంబంధించిన ధరలను రోగులకు కనిపించేలా స్పష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ నెలా ప్రోగ్రాం అధికారి 35 ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తారన్నారు. ఎటువంటి లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదని, ఒకవేళ చేసినట్లు రుజువైతే ఏఆర్టీ చట్టం ప్రకారం రూ.10 లక్షల జరిమానా, 10 ఏళ్ల జైలుశిక్ష విధించడం జరుగుతుందన్నారు.

అనాథలకు అండగా న్యాయసేవాధికార సంస్థ

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనాథలకు అండగా జిల్లాన్యాయసేవాధికార సంస్థ పని చేస్తుందని ఆ సంస్థ కార్యదర్శి కె. హరిబాబు అన్నారు. నగరంలోని పలు సేవా గృహాలను సోమవారం ఆయన సందర్శించారు. ప్రశాంతి ఓల్డేజ్ హోం, స్త్రీ సదనం, మదర్ థెరిసా హోమ్‌లను సందర్శించి వాటిలో ఉంటున్న వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అందిస్తున్న భోజనం, వైద్య సదుపాయాలు, ఇతర అవసరాలను పరిశీలించి నిర్వాహకులతో చర్చించారు. ఆశ్రయం పొందుతున్న వారు కోరితే న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, నిర్వాహకులు యూవీ రమణ, ప్రసాద్, ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు

పాఠశాలను దేవాలయంగా భావించాలి

గుజరాతీపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను సంస్కృతి, సేవ, అంకితభావం కలిగి న దేవాలయంగా భావించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పల శివ రామ్ ప్రసాద్ అన్నారు. అఖిల భారత శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠ శాలల్లో జరుగుతున్న 'మన పాఠశాల-మన గౌరవం' స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని బలగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం ఉరిటి రామనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

కవిటి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): గొర్లెపాడులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని తగు చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు నాయకుడు ఎస్.నారాయణస్వామి కోరారు. సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. చెరువులతో పాటు పోరంబోకు స్థలాలు, ఆర్మీ జవానుకు చెందిన స్థలం ఆక్రమణలకు గురయ్యాయన్నారు.

శాంతి, సామరస్యం నెలకొల్పడమే లక్ష్యం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి, సామరస్యం నెలకొల్పడమే లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మత సామరస్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ మతాలను అనుసరించే ప్రజల్లో అపార్థాలు, విభేదాలు రాకుండా కమిటీ కృషి చేస్తుందన్నారు. పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించి ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 672 సీసీ కెమెరాలు అమర్చారన్నారు. మిగిలిన ప్రార్థనా స్థలాల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు. దేవాల యాలు, చర్చి, మసీదు గోడలపై మత విద్వేషపూరిత రాతలు రాసేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మత పెద్దలు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇబ్బం దులను వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీ రాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, లక్ష్మణరావు, సీఐలు శ్రీనివాసరావు, పైడపునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చట్టం ప్రకారం అర్జీల పరిష్కారానికి పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 51 వినతులు స్వీకరించి బాధితులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో తక్షణం ఫోన్‌లో మాట్లాడారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతులిలా..

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురు వినతులు సమర్పించారు. వాటిలో కొన్ని ఇలా..

పేద దివ్యాంగ విద్యార్థిని ఆదుకోండి

● గ్రీవెన్స్‌లో తల్లి ఆవేదన


దుర్గాప్రసాద్

తన కుమారుడు కొయ్య దుర్గాప్రసాద్ (14) దివ్యాంగుడని, సాయమందించి ఆదుకోవాలని రణస్థలం మండలం పాపారావుపేటకు చెందిన అతని తల్లి వేడుకున్నారు. తాము వ్యవసాయ కూలీలమని, కుమారుడికి పింఛన్ మంజూరు చేసి ఆదు కోవాలని కోరారు. తాము రోజువారీ కూలీకి వెళితే గాని కుటుంబం గడిచే పరిస్థితి లేదని, పింఛన్ ఇస్తే తన కుమారుని చదువుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తగు చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఆమె కోరారు.

పింఛన్ ఇప్పించండి


దివ్యాంగుడు బడ్డి జోగారావుతో తల్లి

తన కుమారుడు బడ్డి జోగారావు పూర్తిస్థాయిలో శత శాతం దివ్యాంగుడని, పింఛన్ అందించి ఆదుకోవాలని నరసన్నపేట నడగాం గ్రామానికి చెందిన అతని తల్లి వేడుకున్నారు. మాట్లాడలేడని, కనీసం కదల్లేడని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, శతశాతం దివ్యాంగ ధ్రువపత్రం ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. ముగ్గురి సంతానంలో పెద్దవాడైన జోగారావుకు నిరంతరం సేవలు చేయాల్సిందేనని, దీంతో తాను కూలికి వెళ్లలేకపోతున్నానని, పింఛన్ అందించాలని జేసీని ఆమె కోరారు.

ఏ ఆసరా లేదు..

● 80 ఏళ్ల వృద్ధురాలి కన్నీటి వేడుకోలు



తన కుమారుడు, కుమార్తె ప్రమాదంలో మృతి చెందారు. తనకు ఎవరూ ఆసరాగా లేరు. సాయమందించి ఆదుకోవాలని శ్రీకాకుళం నగరం హయాతినగరానికి చెందిన 80 ఏళ్ల భోగవరపు మాలతి కోరారు. ఎవరూ లేని ఒంటరినని, కష్టపడేందుకు ఒంట్లో శక్తి లేదని, ఏదైనా సాయం చేస్తే తప్ప పూట గడవని పరిస్థితి. వృద్ధాప్య పింఛను రాలేదని, పింఛన్ అందించి ఆదుకోవాలని విలపించారు.

సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు

శ్రీకాకుళం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు సీఎంగా మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు అయిన సందర్భంగా ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మో హన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. మంచి దార్శనికుడని, ఆయన నేతృత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి సూర్య నారాయణ స్వామికి నగరానికి చెందిన పొట్నూరు శ్రీనివాసరావు దంపతులు రూ. 1,11000 విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం విరాళం చెక్కును ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకట రమణకు అంద జేశారు. దాతలకు ప్రధాన అర్చ కుడు ఇప్పిలి శంకర శర్మ స్వామి చిత్రపటాన్ని అందించారు.

సకాలంలో వడ్డీ చెల్లిస్తే వడ్డీ రాయితీ


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జగన్నాథ రావు

జి.సిగడాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ బ్యాంకు ద్వారా రుణాలకు సకాలంలో వడ్డీ చెల్లించి రాయితీ పొందాలని పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథ రావు అన్నారు. సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలు పూర్తిగా చెల్లించినా, రుణాలకు వడ్డీలు చెల్లించినా ఆన్‌లైన్ రసీదు తీసుకోవాలన్నారు. పంటల బీమా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. బీమా చెల్లించేందుకు ఈనెల 14 వరకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో డైరెక్టర్ పడాల అప్పన్న, సీఈవో ఆబోతుల పాపినాయుడు ఉన్నారు.

యువత రక్తదానం

కవిటి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్ర గోవింద పుట్టుగ గ్రామంలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు ఉద్దానం బ్లడ్ బ్యాంకుకు రక్తదానం చేశారు. సర్పంచ్ పి.లక్ష్మణరావు, నిర్వాహకులు వై.నగేష్, వై.డొంబురు, లక్ష్మీ, ఇ.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు

● మాజీ మంత్రి కృష్ణదాస్

● వైసీపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎరువులను సకాలంలో అందించాలని, వారిని నిర ్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ స్పష్టం చేశారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల, ఆమదావలస నుంచి రైతులు ఆవేదనను తెలిపేందుకు వస్తే పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. వినతిపత్రం అందజేసేందుకు కూడా అడ్డంకులు సృష్టించడం సబబు కాదన్నారు. అంతకుముందు కలెక్టరేట్ వద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే పార్కు వద్ద ధర్నా నిర్వహించేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు. పోలీసులను చూసి వైసీపీ నాయకులు, కార్యకర్తలు మెల్లగా జారుకున్నారు.

నిరసనను అడ్డుకున్న పోలీసులు

ఆమదాలవలస, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్దకు రైతులతో కలిసి వైసీపీ నేతలు నిరసన తెలిపేందుకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్ఐ సనపల బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు బొడ్డేపల్లి పేట వద్ద ఉన్న ఆ పార్టీ కార్యాలయం ఎదుటే ఆయనను కదలకుండా అడ్డుకున్నారు.

పేదవారిపై జాలి, దయ చూపాలి


శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): పేదవారిపై జాలి, దయ చూపాలని ఒక పూట కూడా భోజనం లేని వారికి ఆహారం అందించడం ఎంతో మంచిదని మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ కె.రాధా పుష్పవతి అన్నారు. శ్రీకాకుళం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో సోమ వారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ విష్ణుమూర్తి, కె.రామచంద్రారెడ్డి, విశ్రాంత డీఎస్పీ భార్గవ నాయుడు, నటుకుల మోహన్, పొన్నాడ రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత సింగుపురం

పొందూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీ ల్లో సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. శ్రీకాకుళం జట్టు ద్వితీయ, పొందూరు ఇస్పావీధి జట్టు తృతీయ స్థానాలు పొందాయి. విజేతలకు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్, బాడాన శేషగిరి, సర్పంచ్ శ్రీనివాసరావు బహుమతులను అందించారు.

● కంచిలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా చోట్రాయిపురంలో సోమవారం మండలస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. మామిడిపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విజేతగా నిలిచారు. ఏపీ మోడల్‌స్కూల్ ద్వితీయ, మఠంసరియాపల్లి విద్యార్థులు తృతీయ స్థానాలు పొందారు. విజేతలకు ఎంఈవో సప్పటి శివరాం ప్రసాద్ బహుమతులు అందజేశారు.

నాటకానికి జీవనానికి దగ్గర సంబంధం



శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాటకానికి, జీవితానికి దగ్గర సంబంధం ఉందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.ఎ.శ్రీరామమూర్తి అన్నారు. ఉపనిషన్మందిరంలో నిర్వహిస్తున్న సాహిత్య గణపతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన 'నాటకాన్తహి సాహిత్యం' అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. నాటకాలు కూడా సాహిత్యంతో కూడి ఉన్నాయన్నారు. వక్తను మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ సత్కరించారు. డా.బి.కోమలరావు, డా. ఎస్.నారాయణ మూర్తి, నిష్టల నర్సింహమూర్తి, విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి కోదండ రామాలయంలో డా.ధన్వంతరి సాంస్కృతిక సంస్థ మహతి పుర స్కారాన్ని ప్రముఖ రచయిత భమిడి పాడి గౌరీశంకర్‌కు అందించారు. డా.ఈఎస్ సంపత్‌కుమార్ జ్ఞాపిక, నగదు పురస్కారం అందించి అభినందించారు.

తోటలను నాశనం చేస్తున్నాయంటూ ఫిర్యాదు

కవిటి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రాంతంలోని కొబ్బరి తోటల్లో వేసిన అంతరపంటలు, కొబ్బరి మొక్కలును గొర్రెల మందలు నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. సోమవారం గొర్రెలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వర్షాకాలంలో తోటల్లో జీడి, మామిడి, కొత్తగా కొబ్బరిమొక్కలు నాటుతున్నామని అయితే గొర్రెల మందలు వాటిని పాడుచేస్తున్నాయని కవిటి, జగతి, బెజ్జిపుట్టుగలకు చెందిన రైతులు వాపోయారు. రైతులకు నష్టం వాటిల్లితే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని గొర్రెల యజయానులకు పోలీసులు హెచ్చరించారు.

నేడు రక్తదాన శిబిరం

ఆమదాలవలస, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ రావు తెలిపారు. ఉదయం 9 గంటలకు జరుగు కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలన్నారు.

అంతర పంటలతో అధికాదాయం

కంచిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బొగాబెణి గ్రామంలో సోమవారం నార్త్ కోస్టల్ అధికారుల ఆధ్వర్యంలో రైతులు అధిక ఆదాయం పొందే అంశాలపై అవగాహ కలిగించారు. అధికారులు ప్రకాష్, హేమసుందర్ మాట్లాడుతూ. వరి గట్టు మీద తీగ జాతి మొక్కలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.

న్యూస్ బాక్స్

ఈదుపురంలో వైద్య శిబిరం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1(ఆంధ్ర జ్యోతి): ఇటీవల కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశం ఉండడంతో ఈదుపురం గ్రామంలో వైద్యాధికారి వెచ్చా సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జ్వరాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వయో పరిమితి పెంచాలి

కంచిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసు వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని ఆ సంఘం కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి కోరారు. ఈ మేరకు సంఘ సభ్యులతో కలిసి సోమవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యను రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం

ఆమదాలవలస, సెప్టెంబర్ 1 (ఆంధ్ర జ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పాలపోలమ్మ దేవాలయం ఆవరణలో సోమవారం మహారుద్రాభిషేకం నిర్వహిం చారు. అష్ట గణపతులు, జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

పథకం ప్రకారమే హత్య

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజశేఖర్ మృతి
- నిందితుడి అరెస్టు.. మారణాయుధాలు స్వాధీనం
- వారంలోనే కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి చేతిలో హత్యాయత్నానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలో నిందితుడు దమరసింగు గొల్లబాబు అలియాస్ శంకర్‌ను సోమవారం అరెస్టు చేసి పొందూరు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ మేరకు పొందూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గత నెల 24న గెడ్డకంచరాం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన పుక్కళ్ల రాజశేఖర్‌పై స్నేహితుడు గొల్లబాబు పథకం ప్రకారమే హత్యకు ప్రయత్నించాడన్నారు. వీరిద్దరూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇద్దరి మధ్య విభేదాలు ఏర్పడి రాజశేఖర్‌ని చంపాలనే పన్నాగంతో గొల్లబాబు ఆగస్టులో కత్తులను తెప్పించుకుని ఉంచుకున్నాడన్నారు. అదే గ్రామానికి చెందిన పెయింటింగ్ మేస్త్రీ ఎం.అప్పన్న తన సమీప బంధువు అప్పలస్వామి కుమార్తె పెళ్లి ఫంక్షన్‌కి పిలువగా.. రాజశేఖర్‌తో పాటు పలువురు వెళ్లారు. రాజశేఖర్ తదితరులు అప్పటికే మద్యం సేవించగా గొల్లబాబు ఆలస్యంగా వెళ్లి మద్యం అడగడంతో తాము అప్పటికే తాగేశామని, అయిపోయిందని చెప్పడంతో గొడవకు దిగారు. ఈ గొడవనే అవకాశంగా తీసుకుని శంకర్.. తన ఇంటివద్ద ఉంచిన కత్తులను తీసుకువచ్చి స్నేహితులకు ఫోన్ చేశాడు. వారు ఫోన్ ఎత్తకపోగా లక్ష్మణ అనే వ్యక్తికి ఫోన్ చేసి రాజశేఖర్ ఎక్కడ ఉన్నాడని అడగడంతో ఎందుకు గొడవలంటూ అతడిని వారించాడు. ఈ నేపథ్యంలో రాజశేఖర్, లక్ష్మణ నడుచుకుంటూ గెడ్డకంచరాం వచ్చారు. గ్రామ కూడలి వద్ద రాజశేఖర్.. శంకర్ ఎదురుపడి వాదులాడుకున్నారు. ఈ నేపథ్యంలో రాజశేఖర్ కడుపులో పదునైన కత్తితో శంకర్ పొడిచాడు. దీంతో పేగులు బయటకు వచ్చాయి. వెంటనే లక్ష్మణ రాజశేఖర్‌ను బైక్‌పై జి.సిగడాం పీహెచ్‌సీకి తీసకువెళ్లి ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 25వ తేదీన మృతి చెందాడు. కాగా గొబ్బూరు గ్రామ సమీపంలో జి.సిగడాం ఎస్ఐ మధుసూదనరావు, రెవెన్యూ అధికారుల సమక్షంలో నిందితుడు శంకర్‌ను విచారించి అతని ఇంటిలో ఉన్న మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. రాజశేఖర్ భార్య పుక్కళ్ల హరిప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పొందూరు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి జ్యోత్స్న రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ వై.మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


దాలినాయుడు(ఫైల్)

జలుమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూర్మనాథపురం గ్రామానికి చెందిన మొయ్యి దాలినాయుడు(40) చెరువులో పడి సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి భోజనం చేసిన తరువాత దాలినాయుడు బహిర్భూమికని పిల్లలనారయ్య కోనేరు వైపు వెళ్లాడు. ఎప్పటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం తెల్లవారేసరికి అదె చెరువులో శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతిచెంది ఉంటాడని బావిస్తున్నారు. దాలినాయుడికి భార్య జగదీశ్వరి, కుమారుడు, తల్లి నారాయణమ్మ ఉన్నారు. జగదీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

అనారోగ్యంతో పోలాకి ఏఎస్ఐ..


ఆదినారాయణ(ఫైల్)

పోలాకి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లగా పోలాకి పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆదినారాయణ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆదినారాయణ కొన్నాళ్లగా కాలికి సంబంధిత వ్యాధి తో బాధపడుతున్నారు. దీని ప్రభావం కిడ్నీపై పడడంతో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆదినారాయణ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. కాగా ఈయన మృతిపై సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్ తోపాటు రెవెన్యూ, మండల పరిషత్, వెలుగు సిబ్బంది సంతాపం వ్యక్తంచేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

జలుమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట సమీపంలోని ఓ మామిడి తోటలో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను పట్టుకొని వారినుంచి రు.5040 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

గ్రామాల పేర్లు మార్పుచేయాలి


దీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు, తదితరులు

హిరమండలం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల పేర్లు, సరిహద్దులు మార్పు చేయాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. టెక్కలి డివిజన్‌కు సరైన రావాణా సౌకర్యాలు లేకపోవడంతో మండలం ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందువల్ల హిరమండలం మం డలాన్ని శ్రీకాకుళం డివిజన్‌లోకి మార్పు చేసి, శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించా లని కోరారు. ఈయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

144 మద్యం సీసాలు పట్టివేత

ఆమదాలవలస, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కొత్తవీధికి చెందిన గొద్దు రాము ఇంటిలో 144 మద్యం సీసాలు పట్టుకున్నట్టు ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. సోమ వారం అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించగా అతని ఇంటి వద్ద మూడు కార్డ్ బోర్డు పెట్టెల్లో మద్యం సీసాలున్ననట్లు గుర్తించామన్నారు. వీటివిలువ సుమారు రూ.14,256 ఉంటుందన్నారు. రాముపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

ఆటో మొబైల్ షాపులో చోరీ

ఎచ్చెర్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం పంచాయతీ పొందూరు రోడ్డు ఏవీఎన్ టవర్స్‌లోని నాయుడు ఏజెన్సీస్ ఆటో మొబైల్ షాపులో సోమవారం చోరీ జరిగింది. షాపులో పనిచేస్తున్న వ్యక్తి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో షాపును విడిచి బయటకు వెళ్లాడు. ఇదే సమయంలో తలకు హెల్మెట్ ధరించిన ఓ వ్యక్తి బైక్‌పై అక్కడికి వచ్చి క్యాష్ కౌంటర్‌లోని రూ.40 వేలను అప హరించాడు. కాంప్లెక్స్ బయట ఉన్న సీసీ కెమెరాల్లో సదరు వ్యక్తి వచ్చినట్టు రికార్డు అయ్యింది. ఐదు నిమషాల వ్యవధిలోనే బయటకు వెళ్లి తిరిగి తాను వచ్చి పరిశీలించగా చోరీ జరిగినట్టు గుర్తించి షాపు యజమానికి సమాచారం అందించాడు. ఈ మేరకు షాపు యజమాని ఎ.వెంకు నాయుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ఎల్ఎన్ పేట: శ్యామలాపురం ఆర్ఆర్ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


రణస్థలం: వల్లభరావుపేటలో పింఛన్ అందిస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

పింఛన్‌తో భరోసా

ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో లబ్ధిదారులకు పూర్తి భరోసా లభిస్తుందని పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ సందడిగా సాగింది. లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందించడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు.

\- ఆంధ్రజ్యోతి బృందం

దివ్యాంగుడి ఆనందం..

పలాస, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ లోని రాజమ్మ కాలనీలో దివ్యాంగ పింఛన్ అందుకున్న ఓ వ్యక్తి ఉబ్బితబ్బిబయ్యా డు. ఆ కాలనీలో ఎన్టీయార్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుడు కోట రాముకి రూ.10వేల పింఛన్ అందించడంతో ఆనందం పట్టలేకపోయాడు. తమ ప్రభుత్వం పూర్తిస్థాయి భరోసాగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేయే తన ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.


దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష


పోలాకి: దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


నరసన్నపేట: గాంధీనగర్‌లో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణంనాయుడు..

పరిశుభ్రత ఇలాగేనా?

- టెక్కలిలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం
- శానిటేషన్ మేస్త్రీని తొలగించాలని ఆదేశాలు


చెత్త పోగును పరిశీలిస్తున్న కలెక్టర్

టెక్కలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ఇలాగేనా ఉంచేది.. ఎటు చూసినా చెత్తాచెదారం ఉంటే ఎలా అంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ టెక్కలి మేజర్ పంచాయతీ ఈవో ఏవీ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఎన్టీఆర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్ ఎక్కడిపడితే అక్కడే చెత్త చెదారం కనిపించడంతో మండిపడ్డారు. ఎన్నాళ్ల నుంచి చెత్త తొలగించడం లేదని శానిటేషన్ మేస్త్రీ అప్పన్నపై మండపడ్డారు. ఆదివారం కావడంతో చెత్త తొలగించలేదని శానిటేషన్ మేస్త్రీ బదులివ్వగా.. అక్కడున్న పాల ప్యాకెట్ల కవరుపై ఆగస్టు 17వ తేదీ ఉండడాన్ని గమనించి మరింత మండిపడ్డారు. వెంటనే శానిటేషన్ మేస్త్రీ అప్పన్నను తొలగించాలని ఆదేశించారు. పరిశుభ్రత నెలకొల్పేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, అందుకు 73 పాయింట్లను కూడా గుర్తించామని, దానికి అనుమతి రావాల్సి ఉందని కార్యదర్శి ఏవీ శ్రీనివాస్ చెప్పగా.. పంచాయతీ యంత్రాంగం జాప్యం చేస్తున్నారంటూ కలెక్టర్ మరింత విరుచుకుపడ్డారు. ఇదేనా పారిశుధ్య నిర్మూలనకు చర్యలు, ఇలాగేనా పారిశుధ్యం ఉండేది అంటూ పంచాయతీ సిబ్బందిపై విరుచుకుపడ్డారు. తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ పృధ్వీరాజ్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా సోమవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య టెక్కలి గ్రామ పంచాయతీ యంత్రాంగంతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. టెక్కలిలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఈవోపీఆర్డీ సింహాద్రిని ఆదేశించారు.

యూపీ ప్రభుత్వంతో సెంచూరియన్ వర్సిటీ ఒప్పందం


యూపీ డీజీ రాజీవ్‌కృష్ణతో ఒప్పందం కుదుర్చుకున్న వర్సిటీ అధ్యాపకులు మూర్తికాంతి మిశ్రా, వైస్ చాన్సులర్ సుప్రియ పట్నాయక్

పర్లాకిమిండి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ (యూపీ) ప్రభుత్వంతో సెంచూరియన్ యూనివర్సిటీ ఒక చారిత్రక ఒప్పందం కుదుర్చుకుందని వర్సిటీ అధ్యాపకులు మూర్తికాంతి మిశ్రా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29 న లక్నోలో జరిగిన సమావేశంలో ఆ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ- వర్సిటీ మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా న్యాయ సంబంధిత పరిశోధనాత్మక అంశాల్లో పరస్పర సహకారం అందించుకుంటాయని తెలిపారు. డీజీ రాజీవ్ కృష్ణతో కలిసి ఒప్పందం జరిగినట్టు తెలిపారు. మానవవనరుల సౌకర్యాలు అందుబాటులో ఉన్నా శాస్త్రీయ విద్యా నైపున్యాన్ని మెరుగుపరడం ఆ ఒప్పందం ముఖ్య ఉదేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శుప్రియ పట్నాయక్, యూపీ ల్యాబోరేటరీ ఇన్‌చార్జి సుదీర్‌కూమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికుల బతుకులు దారుణంగా మారాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఒక్కో ఆటో కార్మికునికి రూ25 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బెండిగేటు నూకాలమ్మ ఆటో యూనియన్ సభ్యులు నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు రాజు, సీఐటీయూ నాయకులు ఎన్.మోహనరావు యూనియన్ ప్రతినిధులు బి.ఆనందరావు, ఎన్.చంద్రయ్య పాల్గొన్నారు.

టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి మురుగునీరు



టెక్కలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో సోమవారం ఔట్ గేట్ ప్రాంతానికి వర్షంతో మురుగునీరు చేరడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దశాబ్దాలు తరబడి ఈ సమస్య ఉన్నా డిపో యంత్రాంగం కాలువ నిర్మాణం చేపట్టకపోవడంపై పలువురు ప్రయాణీకులు ఆర్టీసీ యంత్రాంగం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిరంతరం అలుపెరుగని పోరాటంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి 30ఏళ్ల పూర్తయిందని, అప్పటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు ఎం.మనోహర్, కె.చిరంజీవి, వి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలకు కేరాఫ్‌గా..

నరసన్నపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంస్కరణలకు కేరాఫ్ అడ్రాస్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక సంస్కరణలకు బీజం వేసి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా..


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

కొత్తూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలన కొనసాగించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి అన్నారు. సోమవారం కొత్తూరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి తొలిసారి బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఈ క్రమంలో తన పాలనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. 70 ఏళ్ల వయస్సులో దాదాపు 47 ఏళ్లు రాజకీయాల్లో ఉంటూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. టీడీపీ నాయకులు ఎల్.భగవాన్‌దాస్ నాయడు, మడపాన రజారావు, గండివలస తేజేశ్వరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ విశ్వనాథం విగ్రహావిష్కరణ

పలాస, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం విగ్రహాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి డాక్టర్ విశ్వనాథం ఎంతో కృషి చేశారన్నారు. పలాసలో సాంకేతిక విద్యను అందించేందుకు ఐటీఐ నెలకొల్పి దాన్ని ప్రభుత్వానికి ఉదారంగా ధారాదత్తం చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల మైదానానికి ఐదు ఎకరాల స్థలం కూడా ఇచ్చి విద్యారంగాన్ని ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర(చిన్ని)జోగ మల్లి, కొరికాన శంకర్‌తో పాటు ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

హరిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మందస మండలం హరిపురం హైస్కూల్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి డి.కేశవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు బైరి అప్పారావు, హర్చింద్రుడు శరత్‌బాబు, బాబూరావు, ఎంఈవోలు లక్ష్మణరావు, సీహెచ్ సత్యం, సాంబమూర్తి, బి గోపిచంద్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్లోరింగ్ పనులకు సాయం


పనులు ప్రారంభిస్తున్న దువ్వాడ శ్రీధర్

పలాస రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న శివాల యంలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ (బాబా) సోమవారం ప్రారంభించారు. నూతన ఆలయంలో ఫ్లోరింగ్ ఏర్పాటుకు భక్తిభావంతో చేయూతనందిస్తున్న ట్టు తెలిపారు. ఉద్దాన ప్రాంతంలో అతి పెద్ద శివాలయం నిర్మాణం జరుగుతుండడం ఆనందంగా ఉం దన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రేమించిన యువతి.. పెళ్లికి నిరాకరించిందని..

(ఐదో పేజీ తరువాయి)

నిరాకరించింది. అనంతరం శివకుమార్ వేధిస్తున్నాడని ఆ యువతి కుటుంబ సభ్యుల సాయంతో ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎచ్చెర్ల పోలీసులు శివకుమార్‌ను స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి విడిచిపెట్టారు. దీంతో శివకుమార్ ప్రేమించిన యువతి దక్కడం లేదని మనస్తాపం చెంది సోమవారం శ్రీకాకుళంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని సెల్‌టవర్ ఎక్కి దూకేస్తానని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు రెండున్నర గంటలు యువకుడితో మాట్లాడి నచ్చజెప్పి ఫైర్ సిబ్బంది సాయంతో కిందకు దించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి పంపించేశారు.

ఫిషింగ్ హార్బర్‌తో శాశ్వత ఉపాధి

(ఐదో పేజీ తరువాయి)

చేస్తాం. హార్బర్ వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడతాం. కూటమి పాలనలో ఒక్క భావనపాడు గ్రామంలోనే రూ.2.55 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇంటింటికీ కుళాయి కోసం రూ.కోటి మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టీడీపీ నాయకులు హరివరప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, జీరు భీమారావు, అట్టాడ రాంప్రసాద్, రెడ్డి అప్పన్న కూశెట్టి కాంతారావు, బాడాన రమణమ్మ, జనసేన ఇన్‌చార్జి కె.కిరణకుమార్ పాల్గొన్నారు.

పశువుల పట్టివేత

మెళియాపుట్టి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కంచిలి నుంచి మెళియాపుట్టి మీదుగా నారాయణవలస సంతకు అక్రమంగా తరలిస్తున్న పశువులను సోమవారం సాయంత్రం చిన్నహంస వద్ద పట్టుకున్నట్టు ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. ఆరు గేదెలతో వెళ్తున్న వాహనం సీజ్ చేసినట్టు తెలిపారు. వీటి యజమానిపై కేసు నమోదు చేసి, గేదెలను కొత్తవలస గోశాలకు తరలించినట్టు తెలిపారు.

రేపు నందిగాంలో నృత్య పోటీలు

నందిగాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నందిగాం కారిగుడ్డివీధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం రాత్రి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు గ్రూప్ డ్యాన్స్, సోలోడ్యాన్స్ ఉంటాయని, ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, ఆసక్తి గల వారు 8309521459, 8328634898, 9849267853నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అడ్డుకున్న పోలీసులు

నరసన్నపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై నిరసనంగా శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించనున్న ధర్నాకు వెళ్తున్న వైసీపీ శ్రేణులను, నాయకులకు సోమవారం మడపాం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. నరసన్నపేట నియోజవర్గం నుంచి వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. పోలీసులు ఉన్నతాధికారులు సూచనలు మేరకు శ్రీకాకుళం వెళ్లకుండా అడ్డుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు గ్రీవెన్స్‌లో పిర్యాదు చేసేందుకు అనుమతించారు. సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐలు, పోలీసులు ఉన్నారు.

ఎరువులు అందించాలి

పలాస రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో ఎరువులను అందజేయాలని, యూరియా, పొటాష్ సకాలంలో అందనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని జీడి రైతు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామ సచివాలయం వద్ద జీడిరైతుసంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తెప్పల అజయ్‌కుమార్, సర్పంచ్ సైన దేశయ్య, ఉపసర్పంచ్ ఆర్.పురుషోత్తం, ముసలయ్య, సింహాద్రి,లోకనాథం పాల్గొన్నారు. అదే విధంగా ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని అఖిలభారత కిసాన్ మహాసభ సభ్యులు డిమాండ్ చేశారు. బొడ్డపాడు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలబారత కిసాన్ మహాసభ సభ్యులు ఎం.రామారావు, బి.హేమా రావు, యుగంధర్, కె.వల్లభరావు పాల్గొన్నారు.

మండలం ఏర్పాటు చేయాలి

కొత్తూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెట్టూరు కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ సాధన సమితి కమిటీ అధ్యక్షుడు బామిడి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతి పత్రం అందించారు. కొత్తూరు మండలంలో భౌగోళికంగా, జనసాంద్రత ఎక్కువగా ఉండడంతో పరిపాలన సౌలభ్యం కోసం కొత్తగా మెట్టూరు కేంద్రంగా ఏర్పాటు చేయాలని నాయకులు విన్నవించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు 22మంది పంచాయతీ సర్పంచ్‌లు తీర్మాణాలు చేసి వినతి పత్రం అందించామని విన్నవించారు. సభ్యులు గెడ్డవలస కమలాకరావు, చుక్కారాంబాబు, గొర్లె గోపాలకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను కాపాడుదాం

మెళియాపుట్టి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కలికట్టుగా కాపాడుకుందామని తహసీల్దార్ బి.పాపరావు తెలిపారు. సోమవారం తన కారాలయంలో అన్ని మతాలు ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న పండగల్లో అందరూ పాల్గొని సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాద్ పండా, ఎస్ఐ రమేష్‌బాబు, పలు మతాలు పెద్దలు ఉన్నారు.

పనులు పూర్తి చేయాలి

మందస, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దామోదర సాగర్ కుడికాలువ, డబార్సింగ్ రిజర్వాయర్ మదుము పనులు పూర్తి చేయాలని మహేంద్ర రైతుసంఘం ప్రతినిధులు బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు, దాసరి శ్రీరాములు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కళింగదళ్, డబార్సింగ్ రిజర్వాయర్ మదుములు సరి చేయాలని, రైతులకు ఉపయోగపడేలా బోర్లు ఏర్పాటు చేయాలని, జీడి పిక్కలకు మద్దతు ధరగా రూ.16వేలు అందజేయాలని కోరారు.

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించండి

పాతపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాతపట్నం పంచాయతీ ఆస్తులను పరిరక్షించాలని వైసీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారిలకు వినతిపత్రాన్ని అందజేశారు. అన్నా క్యాంటీన్ నిర్మాణం కోసం పాతపట్నం పంచాయతీ కార్యాలయ భవనాన్ని కూల్చివేయడం సరికాదన్నారు. ఈవోకి వినతిపత్రాన్ని అందజేసినా ఫలితం లేకపోయిందన్నారు. కొంతమంది దాతలు ముందుకొచ్చి ఈ స్థలాన్ని విరాళంగా ఇచ్చారన్నారు. ఈ విషయంలో తగని చర్యలు తీసుకోవాలని కోరారు.